# మండలంలో భూకంపం...

## -భయాందోళనలో ప్రజలు

**న్యాల్‌కల్, జనవరి 27, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన న్యాల్‌కల్‌తో పాటు మండలంలోని ముంగి తదితర గ్రామాల్లో సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో భూమి కంపించినట్లు ప్రజలు భయాందోళనలు వ్యక్త చేశారు. ఇండ్లలో, వ్యవసాయ పొలాల వద్ద, టీ కొట్టులో ఉన్న ప్రజలు భూమి కొన్ని సెక్షన్ల పాటు కంపించడంతో భయానికి గురయినారు. సాయంత్రం నుంచి మండల ప్రజలు ఆదే పనిగా చర్చించుకున్నారు. భూకంపం విషయమై అధికారులను సంప్రదించినా ప్రయోజనం లేకుండా పోయింది.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

**చిన్నశంకరంపేట, జనవరి 27, ప్రభాతవార్త:** రొడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధి టీ మాందాపూర్ పంచాయతీ పరిధిలోని రాంజీ తండా వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నశంకరంపేట పట్టణానికి చెందిన ప్రభాకర్ తన ద్విచక్రవాహనంపై ఉదయం మెదక్ వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో కొర్విపల్లి తండాకు చెందిన శాంతి, చందర్‌లు ద్విచక్రవాహనంపై మెదక్ ఆసుపత్రికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఇరువురి ద్విచక్రవాహనాలు అదుపు తప్పి ఎదురెదురుగా బలంగా ఢీ కొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రభాకర్, శాంతిలకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానిఇ హెడ్ కానిస్టేబుల్ మహెందర్, విఠల్‌లు చేరుకొని క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# ఆత్మస్థైర్యం విజయానికి పునాది : కలెక్టర్ వల్లూరి క్రాంతి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 27, ప్రభాతవార్త:** దివ్యాంగులు ఆత్మస్థైర్యంలో ముందుకు సాగితే విజయాలు సాధించడం తథ్యమని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. జిల్లా మహిళా, శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖల అధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంఓ జిల్లా స్థాయి అంతర్జాతీయ దివ్యాగుల దినోత్సవ వేడుకలను (లూయిస్ బ్రేయిలీ జయంతిని) జరుపుకున్నారు. జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ అంగవైకల్యం శరీరానికి గాని మనసుకు కాదని, దృఢ సంకల్పంతో ఆశయాన్ని నిర్ణయించుకుని ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా తన ఐఏఎస్ బ్యాచ్ అధికారి అజయ్ ఆరోరా విజయాన్ని దివ్యాంగులకు వివరించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటి కార్యదర్శి జె హనుమంతరావు మాట్లాడుత దివ్యాగులు తమలో ఉన్న వైకల్యాన్ని గురించి ఆలోచించకుండా తమలో ఉన్న నైపుణ్యాలను, ప్రావీణ్యతను వెలికి తీసుకువాలని సూచించారు. న్యాయ సలహా కొరకు న్యాయసేవా సంస్థను సంప్రదించాలన్నారు. దివ్యాంగులకు సేవలిందిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను ఈ సందర్భంగా సత్కరించారు. దివ్యాంగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి డిడబ్ల్యుఓ సంధ్యారాణి, డిఆర్‌డిఓ శ్రీనివాసరావు, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ గాయత్రి దేవి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఈఓఉ వెంకటేశ్వర్లు, మెప్మా పిడి గీత, ఏపీడి సూర్యరావు, సిడిపిఓ రేణుక, యువజన సంఘాల జిల్లా అధ్యక్షులు కూన వేణుగోపాల్, దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు జుబేదా మన్నె పోచయ్య, బొక్క ఇస్మాయిల్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

# నైపుణ్యం అభివృద్ధి చేసుకుంటేనే ఉపాధి అవకాశాలు ఎక్కువ

## -జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**మెదక్ అర్బన్, జనవరి27 ప్రభాతవార్త:** నైపుణ్యం అభివృద్ధి చేసుకుంటేనే ఉపాధి అవకాశాలు ఎక్కువగా దొరుకుతాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా నిరుద్యోగ యువతకు సూచించారు. స్థానిక వైస్రాయ్ గార్డెన్‌లో శనివారం జరిగిన ఉద్యోగ మేళలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉద్యోగ మేళను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వచ్చిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యోగ మేళ నిరుద్యోగులకు గొప్ప అవకాశం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి మండలంలో ఒక ఇంటర్ నేషనల్ స్కూల్, రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. కేవలం నైపుణ్యం వల్ల ఎన్నో నూతన ఉద్యోగాల కోసం పోటీ పడొచ్చున్నారు. నూతన ఉద్యోగాల్లో నియామకం పొందే వారు ఎలాంటి అపోహలకు తావివ్వద్దని, అనుభవంతో ఉద్యోగాలలో, ప్యాకేజ్‌లలో మార్పులు వస్తాయన్నారు. వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాల్‌లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ చైర్మన్ సాబ్యసాచి ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లాలోని యువతీ యువకులు కోసం మేగా జాబ్ మేళా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల దాదాపు 70 కంపెనీల ప్రతినిధులు సుమారు నాలుగు వేల ఖాళీలను ఇందులో పాల్గొన్నాయని, 5వ తరగతి నుండి పీజీ వరకు, వయస్సు 18 నుండి 30 వరకు గల యువతీ యువకులు 615 మంది రిజిష్టరు చేసుకొని, సెలెక్టెడ్ 52 మంది, ప్రాసెస్‌లో ఉన్న వాళ్ల 165 మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా యువజన క్రీడా అధికారి నాగరాజు, మెదక్ తహశీల్దార్, వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

## కలెక్టర్‌కు ఫోటో ఫ్రేమ్ అందించిన మూగ కళాకారుడు



కలెక్టర్ వల్లూరి క్రాంతికి ఫోటో ఫ్రేమ్ బహుకరిస్తున్న మూగ కళాకారులు

**సిర్గాపూర్, జనవరి 27, ప్రభాతవార్త:** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురష్కరించుకుని శనివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో కలెక్టర్ వల్లూరి క్రాంతికి మూగ కళాకారుడు గూడూరు ఆగమప్ప కలెక్టర్ ఫోటో ఫ్రేమ్‌ను అందించారు. మండలంలోని కడ్పల్ గ్రామానికి చెందిన గూడూరు ఆగమప్ప పెన్సిల్‌తో ఆర్ట్ చేసిన తన ఛాయా చిత్రంను అందుకున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆర్టిస్ట్ ఆగమప్ప ప్రతిభను కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశించి అభినందించారు. కార్యక్రమంలో మూగ ఆర్టిస్ట్ సోదరుడు నాగరాజు ఉన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే సంజీవరెడ్డి



చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే పి సంజీవరెడ్డి

**మనూర్, జనవరి 27, ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రజా పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన మనూర్‌లోని ఐకెపి కార్యాలయ ఆవరణలో కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేసితీరుతామన్నారు. మండలంలోని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి లబ్దిదారులకు గృహ వినియోగం కోసం మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకునేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ వెంకటేష్, ఎంపిపి అధ్యక్షురాలు కొంగరి జయక్ష మోహన్‌రెడ్డి, తహసీల్దార్ మల్లేష్ కుమార్, ఎంపిడిఓ శాజులుద్దీన్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భోజిరెడ్డి, నాయకులు దిగంబర్‌రెడ్డ, జగదీశ్వర్‌రెడ్డి, బిరేదార్ దత్తు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి

### -జిల్లా అదనపు కలెక్టర్ రమేష్



గ్రంథాలయంలో సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేష్

**మెదక్ అర్బన్, నవంబర్27 ప్రభాతవార్త:** విద్యార్థులు, పాఠకులు గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారులతో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాయాలు దేశాన్ని మార్చే ఆలయా లు అని అన్నారు. ఎంతో మంది భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో గ్రంథాలయాల పాత్ర గొప్పదన్నారు. గ్రంథాయాలు విద్యార్థులను, పాఠకులకు ఉన్నత ఉద్యోగవంతులుగా తీర్చిదిద్ది జీవితంలో గొప్ప స్థితిలో ఉంచడానికి ఉపయోగపడతాయని తెలిపారు. ఈ గ్రంథాలయం నుంచి ఎందో విద్యార్థులు, పాఠకులు ఉన్నత ఉద్యోగులుగా తీర్చిదిద్దిందన్నారు. పేద విద్యార్థులకు వరం, మధ్య తరగతి వారికి ఎంతో ఉపయోగంగా ఉందన్నారు. ఎన్నో పుస్తకాలు, కంప్యూటర్స్, ఇంటర్నెట్, పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయం అభివృద్ధికి పలు ప్రతిపాదనలను తయారు చేసి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాధాకిషన్, జిల్లా పంచాయితీ అధికారి సాయిబాబా, పీపీఆర్‌వో ఏడుకొండలు, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వంశీకృష్ణ, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి వెన్నెముక గ్రామపంచాయతీలు

- -నాలుగు రోజుల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తుంది
- -పాములపర్తికి రూ.30 లక్షల నిధులు మంజూరు
- -ప్రజా సంక్షేమ పాలనే కాంగ్రెస్ లక్ష్యం
- -బిసి సంక్షేమ, రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



నూతన గ్రామపంచాయతీ భవనంలో సర్పంచ్‌ను సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**మర్కుక్, జనవరి 27 (ప్రభాతవార్త):** గ్రామపంచాయతీలు ఆర్థికంగా బాగుండాలని మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ అభియాన్ చట్టాన్ని తేవడం వల్ల దేశానికి వెన్నెముకగా గ్రామపంచాయతీలు పనిచేస్తున్నాయని బిసి సంక్షేమ, రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో నూతనంగా రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి వారు ప్రారంభించారు. అంతకు ముందు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి ప్రభాకర్‌గౌడ్‌కు శాలువాలతో సన్మానించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా గ్రామపంచాయతీ భవనానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామపంచాయతీలు అభివృద్ధి చెందాలని రాజీవ్‌గాంధీ అనేక సంస్కరణలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీలకు సహకరించకపోయినా సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధి కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అభివృద్ధి చేపట్టారని తెలిపారు. నాలుగు రోజుల్లో సర్పంచ్ పదవీకాలం ముగియనుందని, ప్రత్యేకాధికారులు గ్రామపంచాయతీల్లో విధులు నిర్వహిస్తారని తెలిపారు. పాములపర్తి గ్రామ అభివృద్ధి కోసం రూ.20 లక్షలు, సర్దార్ పాపన్నగౌడ్ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల్లో అభివృద్ధి కోసం కృషి చేస్తామని, ఇప్పటి వరకు లక్షల్లో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించామని, త్వరలోనే పథకాల అమలుకు కృషి చేస్తామన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం గ్రామపంచాయతీల్లో స్టీల్ ప్లేట్స్, స్టీల్ గ్లాసులు ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. ప్లాస్టిక్‌ను తరిమికొట్టేందుకు కలెక్టర్ కార్యాలయాల నుండి గ్రామపంచాయతీల వరకు ప్రజలకు అవగాహన కల్పించేలా చొరవ తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుండి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులకు 10 కోట్ల నిధులు కేటాయించగా అందులో నుండి పాములపర్తికి రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కోసం 2వేల బస్సులను కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా నియోజకవర్గ పరిధిలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు మంత్రి ప్రభాకర్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

**తీగుల్‌లో బ్యాంక్ ఏర్పాటు చేయాలి**

జగదేవ్‌పూర్ మండలంలోని తీగుల్ గ్రామానికి బస్సు సౌకర్యంతో పాటు బ్యాంక్ ఏర్పాటు చేయాలని ఎంపిటిసి మంజుల మహేందర్‌రెడ్డి మంత్రికి వినతిపత్రం అందజేయగా స్పందించిన పొన్నం ప్రభాకర్ కలెక్టర్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ బన్సిలాల్, మాజీ ఎంపి సురేశ్‌షెట్కార్, ఎంపిపి పాండుగౌడ్, డిపిఓ దేవకిదేవి, డిఎల్‌పిఓ, మండల ప్రత్యేకాధికారి కౌసల్యాదేవి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, స్థానిక సర్పంచ్ తిరుమల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కనకయ్యగౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు క్రాంతి కుమార్, ఉపసర్పంచ్ పద్మా నర్సింలు, జగదేవ్‌పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, మల్లేశం, మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖను సత్కరించిన దేవాలయ కమిటీ



హైదారాబాద్‌లో మంత్రి కొండా సురేఖను కలిసి సన్మానిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, జనవరి 27, ప్రభాతవార్త:** కొమురవెల్లి దేవాలయ పునరుద్దరణ కమిటీ చైర్మన్, సభ్యుల కమిటీ నియామకం అయినా సందర్భంగా శనివారం దేవాదాయశాఖ మంత్ర కొండా సురేఖను జనగామ జిల్లా డిసిసి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధ్వర్యంలో కలిసి కృతజ్ఞతలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అలయ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు అల్లం శ్రీనివాస్, ముస్త్యాల దామోదర్, తాళ్లపల్లి రమేష్, లింగంపల్లి శ్రీనివాస్, మేడికుంట శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు మహాదేవుని శ్రీనివాస్‌లు మాట్లాడుతూ జాతర సందర్భంగా పార్కింగ్ ప్రదేశాల నుంచి అలయం వరకు ఎలక్ట్రిక్ అటోలు ఏర్పాటు చేయాలని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. త్వరలోనే దాతల సహకారంతో 120 గదుల సముదాయం నిర్మించడం కోసం విన్నవించినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కలగకుండా దేవాదాయశాఖ అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి అదేశించినట్లు తెలిపారు.

## భవనం పైనుండి పడి వ్యక్తి మృతి

**కొల్చారం, జనవరి27 ప్రభాతవార్త:** అసలు ఎరుకల మల్లేశం ఎలా చనిపోయాడు.. మల్లేశం మృతిపై అతని కుటుంబ సభ్యులు సవాలక్ష అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం కొల్చారం మండలం రాంపూర్ గ్రామంలో అనుమానాస్పద స్థితిలో మూడు అంతస్థుల భవనం పైనుండి పడి ఎరుకల మల్లేశం మృతి చెందాడు. మల్లేశం మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతుని తండ్రి పోచయ్య ఫిర్యాదు మేరకు ఘనట స్థలానికి మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, స్థానిక ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌లు చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఘటన స్థలానికి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం బృందాలు చేరుకొని ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.



మృతుడు మల్లేశం వద్ద బిల్డింగ్ దృశ్యం

## ఒత్తిడిని తగ్గించేందుకు క్రీడలు దోహపడతాయి : ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ఒత్తిడిని తగ్గించేందుకు క్రీడలు దోహపడుతాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని మినీ స్టేడియంలో డిసిసిబి, స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా ఉద్యోగుల మధ్య క్రికెట్ పోటీలను అయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకు ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న మీరు క్రీడాకారులుగా మారారని తెలిపారు. సిద్దిపేట స్టేడియంకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన అతిథులకు క్రీడా పోటీలు అడేందుకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. మహిళా ఉద్యోగులను సైతం క్రీడా పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

**సమాజ శ్రేయస్సు..సామాజిక భవనాలకు అదర్శం సిద్దిపేట**

సమాజ శ్రేయస్సు..సామాజిక భవనాలకు సిద్దిపేట అదర్శంగా నిలుస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని కాళ్లకుంట కాలనీలో పద్మశాలి సంఘం భవనాన్ని అయన ప్రారంభించి మాట్లాడారు. సమాజం కొరకు పాటు పడే వారికి నా పూర్తి సహాయ ం.. ప్రోత్సహం ఉంటుందన్నారు. పట్టణంలోని పద్మశాలి భవనాలకు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు.

**ఎలక్ట్రిషన్స్ ప్రమాద జాగ్రత్తలకు శిక్షణ ఇప్పిస్తా**

ఎలక్ట్రిషన్స్ ప్రమాదాలకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని శిక్షణ ఇప్పిస్తానని ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. థామస్ అల్వా ఎడిసన్ బల్బు కనుగొన్న దినోత్సవాన్ని ఎలక్ట్రిషన్ డేగా జపుకుంటున్నారని తెలిపారు. సిద్దిపేట ప్రైవేటు ఎలక్ట్రిషన్స్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన ఎలక్రిస్టషన్ డే కార్యక్రమంలో అయన పాల్గొని జెండా అవిష్కరించి మాట్లాడారు. ఎలక్ట్రిషన్స్ ప్రమాద బీమా వచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కాగా సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ పాఠశాలలో విద్యార్థులకు స్నాక్స్, డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపిణీ చేశారు.



క్రీడ పోటీలను ప్రారంభిస్తున్న హరీష్‌రావు

## అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను చంపిన భార్య

### -24 గంటల్లో కేసును చేధించిన పోలీసులు

**ములుగు, జనవరి 27 (ప్రభాతవార్త):** అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను భార్య చంపి ఆత్మహత్యగా చిత్రీకరించిన సంఘటన ఇది... గజ్వేల్ ఏసిపి ఎం.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం ములుగు మండల పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ బహిలంపూర్ గ్రామానికి చెందిన గువ్వ నరేష్(30) ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గత తొమ్మిది సంవత్సరాల క్రితం క్షీరసాగర్ గ్రామానికి చెందిన లత(28)తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. గతకొంత కాలంగా సంసారం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 25వ తేదీన రాత్రి 11 గంటల సమయంలో నరేష్ ఉరివేసుకొని చనిపోయాడని భార్య లత మృతుని తండ్రి మల్లేష్‌కు తెలిపింది. సమాచారం అందుకున్న ములుగు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఇట్టి కేసు విషయంలో గజ్వేల్ రూరల్ సిఐ జానకిరాంరెడ్డి, ములుగు ఎస్ఐ సిహెచ్.విజయ్‌కుమార్‌లు పరిశోధన ప్రారంభించి నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించారు. మృతుడు నరేష్ భార్య లత, చిన్నతిమ్మాపూర్ గ్రామానికి చెందిన భువనేష్ అలియాస్ భానులు క్షీరసాగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. లత వివాహం తర్వాత వారి తల్లిగారి ఇంటికి వచ్చిపోయే క్రమంలో లత, భువనేష్‌లు కలిసేవారు. ఈ క్రమంలో వారు ఫోన్‌లలో మాట్లాడుకుంటూ అక్రమ సంబంధం ఏర్పర్చుకున్నారు. వారు ఇరువురు పెళ్ళి చేసుకోవాలని అనుకున్నారు. వారి మధ్య ఉన్న సంబంధం మృతుడు నరేష్‌కు తెలియడంతో లతను మందలించాడు. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని, ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని అనుకున్నారు. ఈనెల 25వ తేదీన మృతుడు నరేష్ మద్యం తాగి పడుకున్న తర్వాత లత తన ప్రియుడు భువనేష్‌కు ఫోన్‌చేసి పిలిపించుకొని ఇద్దరు కలిసి నరేష్ గొంతు పిసికి చంపివేశారు. అనంతరం ఇంటి పైకప్పుకు చీర కట్టి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లుగా చిత్రీకరించారు. ఇట్టి కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను 24 గంటల్లో గుర్తించి అరెస్ట్ చేసి వారి నుండి రెండు మొబైల్ ఫోన్‌లు, ఒక మోటార్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును చేధించిన పోలీస్ సిబ్బందిని ఏసిపి రమేష్ అభినందించారు.



వివరాలు తెలుపుతున్న గజ్వేల్ ఏసిపి రమేష్

## అయోధ్య కరసేవకులకు త్వరలో ఘన సన్మానం



సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల రాజయ్య

**కొల్చారం, జనవరి27 ప్రభాతవార్త:**
అయోధ్య కర సేవలో 1990-1992లో పాల్గొన్న రామ భక్తులకు త్వరలో ఘన సన్మానం ఏర్పాటు చేస్తున్నట్లు బీజేపీ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ నాయకులు రఘువీరారెడ్డి, బీజేపీ పార్టీ కొల్చారం మండల అధ్యక్షులు పాతూరి దయాకర్‌గౌడ్, బీజేపీ పార్టీ సీనియర్ నేత జూలకంటి సంగమేశ్వర్‌లు అన్నారు. శనివారం కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి హనుమమ్మ గార్డెన్స్‌లో ఆకుల రాజయ్య పిలుపు మేరకు కర సేవకుల సన్మానంపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రఘువీరారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి, దయాకర్‌గౌడ్, సంగమేశ్వర్‌లు మాట్లాడుతూ ఫిబ్రవరి రెండవ వారంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో ఉన్న అయోధ్య కర సేవకుల సన్మాన కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరీష్‌రెడ్డి, గురువారెడ్డి, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం



ఎమ్మెల్యే సునితారెడ్డి చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**శివ్వంపేట, జనవరి27 ప్రభాతవార్త:**
శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామానికి చెందిన సార వరలక్ష్మీ కుమారుడు నరేందర్‌గౌడ్ ఉన్నత చదువుల కొరకు అవసరమున్న ఆర్థిక సహాయాన్ని శివ్వంపేట మండల జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త తన స్వంత డబ్బులైన 10 వేల రూపాయలను ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిల చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, ఎంపీపీ ఉపాధ్యక్షులు రమాకాంత్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వై. రమణాగౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, యాదాగౌడ్, చింత స్వామి, మహిపాల్‌రెడ్డి, ఆకుల శ్రీనివాస్, పవన్‌గుప్త, సార శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

**సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే సునితారెడ్డి**
శివ్వంపేట మండలం ఉసిరికపల్లి గ్రామ సర్పంచి పోతరాజు బాబూరావు తల్లి లలిత అకస్మాత్తుగా మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునితా లక్ష్మారెడ్డి అంత్యక్రియలకు హాజరై సర్పంచి బాబూరావుతో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడవద్దని, అండగా మేముంటామని ఆమె హామీ ఇచ్చారు. సునితా లక్ష్మారెడ్డి వెంట ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణాగౌడ్, ఎంపీటీసీ సభ్యులు మర్రి సత్తిరెడ్డి, బీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిల్వేరి వీరేశం, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, మండల పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు జి. శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు తూము కృష్ణారావు, యాదాగౌడ్, మర్రి మహేందర్‌రెడ్డి, చింత స్వామి తదితరులు ఉన్నారు.

**ప్రత్యేక తరగతులను పరిశీలించిన మండల విద్యాధికారి నీలకంఠం**



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో నీలకంఠం

**కొల్చారం, జనవరి27 ప్రభాతవార్త:**
మండల పరిధిలోని వరిగుంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం మండల విద్యాధికారి నీలకంఠం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పర్యవేక్షించారు. అదేవిధంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి, వచ్చే బోర్డ్ ఎగ్జామ్స్‌కి సిద్ధంగా ఉండాలని సలహాలు, సూచనలు చేశారు. అలాగే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రాక్టీస్ టెస్ట్‌లు నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని యదావిధంగా సమయానికి విద్యార్థులకు అందజేయాలని సూచించారు.

## రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి : ఎస్ఐ బాలరాజ్



రోడ్డు భద్రత వారోత్సవాలపై వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**పెద్దశంకరంపేట, జనవరి27 ప్రభాతవార్త:**
ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పెద్దశంకరంపేట ఎస్ఐ బాలరాజు, ఎన్‌హెచ్ఏఐఎంఎస్ మేనేజర్ మహమ్మద్ ఖాజీ మైనుద్దీన్‌లు అన్నారు. శనివారం 161వ జాతీయ రహదారిపై కోలపల్లి టోల్ ప్లాజా వద్ద రోడ్డు భద్రత వారోత్సవాలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన ధృవపత్రాలు ఉంచుకోవాలన్నారు. కార్లు, పెద్ద పెద్ద వాహనాలలో ప్రయాణించేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత ప్రాముఖ్యతను వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ కూడా వాహనాలు నడపవద్దని, సర్వీస్ రోడ్డుపైనే ప్రయాణం చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, హైవే పెట్రోలింగ్ సిబ్బంది, అంబులెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లిలో ఘనంగా ముగిసిన శ్రీమల్లిఖార్జునస్వామి జాతర

**నర్సాపూర్, జనవరి 27.ప్రభాతవార్త:**
మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో శ్రీ కేతకీ బ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి జాతర మహోత్సవాలను ఆలయ నిర్మాణదాత, బిజెపి పార్టీ నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ ఆ ధ్వర్యంలో నాలుగు రోజుల పాటు ఘనంగా జరుగగా రథోత్సవ ఊరేగింపు తో శ్రీ మల్లికార్జునస్వామి జాతర మహోత్సవాలు ముగిశాయి. వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ దంపతులచే శ్రీ మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజాకార్యక్రమాలతో పాటు రుద్రయాగం, సామూహిక సత్యానారాయణ వ్రతాలు. రథోత్సవం ఊరేగింపును నిర్వహించారు. అంతేగాక ఈ జాతరలో దేవుని లగ్నం, బండ్లు బోనాల ఊంగింపు, అగ్నిగుండాలు ఒగ్గుకథలు వంటి కార్యక్రమాలు ఎంతో వైభవంగా జరిగాయి. అనంతరం ఈ జాతర మహోత్సవాల్లో శ్రీ రంగం పేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీ మాదవానాంద సరస్వతిస్వామి హాజరై మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు చేశారు అంతేగాక నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ తదితర అగ్రనాయకులు ఈ జాతర మహోత్సవాలకు హాజరయ్యి స్వామి కి ప్రత్యేక పూజలుచేశారు. ఈ సందర్భంగా వాల్దాస్ రాదా మల్లేష్‌గౌడ్ ఈ ఆలయంలో ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్దలతో, నియమ నిష్టలతో ప్రత్యేక పూజలు చేయగా ఆలయ పూజారి, వేద పండితులు గౌడిచర్ల హరిప్రసాద్ శర్మ బృందం వేద మంత్రోచ్చరణల మధ్య న వైదిక నిర్వహణ గావించారు. ఈ మేరకు శ్రీ మల్లికార్జునస్వామి జాతర మహోత్సవాలతో గ్రామంలో గ్రామస్తులు ఒక పండుగలా జరుపుకున్నారు. అనంతరం హాజరైన భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించడం జరిగింది. ఈ ఆలయంలోప్రతి రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించగా భక్తులు ప్రజలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ ఆలయంలో జాతర సందర్భంగా ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉంచిన పారిశుధ్య కార్మికులకు, స్వామివారికి పూజలు చేసిన ఒగ్గు పూజారులను జాతర నిర్వాహకులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ శాలూవాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణదాత, బిజెపి పార్టీ నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ తో పాటు గ్రామ సర్పంచ్ బోయిని కృష్ణ. ఉప సర్పంచ్‌గణేశ్‌గౌడ్, అరవింద్‌గౌడ్, రవిందర్‌గుప్త, విజయకుమార్‌గుప్త, నవీన్‌గుప్త. కిరణ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, పెద్దనర్సింలు, చిన్న నర్సింలు, నవీన్‌గౌడ్, రాజ్‌కుమార్, ఉప్పలపు రాజు గ్రామ పెద్దలు, ఒగ్గు పూజా రులు గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు



గొల్లపల్లలో శ్రీ మల్లికార్జునస్వామి జాతర మహోత్సవాల సందర్భంగా రథోత్స వంఊరేంపులో పాల్గొన్న ఆలయ నిర్మాణదాత వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ తదితరులు

## ఇసుక, మట్టి అనుమతులు లేకుండా తవ్వినా, తరలించినా కఠినమైన చర్యలు

**వెల్దుర్తి, జనవరి27 ప్రభాతవార్త:**
కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో భూగర్భ వనరులైన ఇసుక, మట్టి ప్రభుత్వ అనుమతులు లేకుండా త్రవ్వినా, తరలించినా కఠినమైన చర్యలు తీసుకుంటామని వెల్దుర్తి, మాసాయిపేట మండలాల తహశీల్దార్లు తులసీరామ్, జ్ఞానజ్యోతి, వెల్దుర్తి ఎస్ఐ మధుసూదన్‌గౌడ్, ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మలు హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి త్రవ్వకాలకు పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకుంటే తాము మోక పైకి పరిశీలించి సంబంధిత మైనింగ్ ఏడీకి నివేదిక పంపుతామన్నారు. అనంతరం నివేదిక వచ్చిన తరువాత పట్టాదారు అట్టి మట్టిని లేవల్ చేసుకోవడానికి వీలు ఉంటుందని, అలాంటి అనుమతులు లేకుండా ఉంటే కఠిన చర్యలతో పాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. మట్టి, ఇసుక త్రవ్వకాలు, తరలింపుకు ఎలాంటి అనుమతులు లేవని వారు చెప్పారు. మట్టి, ఇసుక, దుబ్బ తవ్వకాలు జరిపినా, తరలించిన ఖచ్చితంగా భూగర్భ వనరుల శాఖ అనుమతులు పొందాలని వారు తెలిపారు. లేనియెడల త్రవ్వకాలు జరిపే వారిపై, తరలించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే గ్రామాల్లో జరిగే భూగర్భవనరుల అక్రమాలపై పంచాయితీ కార్యదర్శులు నిఘా పెట్టాలని సూచించారు. గ్రామాల్లో త్రవ్వకాలు జరిపినా, ఇసుక, మట్టి తరలించినా వెంటనే వాహనాలను పట్టుకొని తహశీల్దార్లకు లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి మండలాలకు చెందిన గ్రామ పంచాయితీల కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్లు

## విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి : కలెక్టర్ రాజర్షి షా



నర్సాపూర్ లోని బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా తదితరులు

**నర్సాపూర్, జనవరి 27.ప్రభాతవార్త:**
విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాను ప్రథమ స్థానం లోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలను, జూనియర్‌కళాశాలను ఆయన డిఈవో రాధాకిషన్ ,ఎంఈవో బుచ్యానాయక్ తో కలిసి సందర్శించి పరిశీలించారు. అదేవిదంగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనితీరును ప్రత్యేక తరగతుల నిర్వహణ ప్రీ ఫైనల్ పరీక్షలు తదితర విషయాలపై తెలుసుకున్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పదవతరగతిలో మంచి ఫలితాలు సాధించడం కోసం అన్ని పాఠశాలలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు వారి విద్యార్థుల ను పర్యవేక్షించే తీరును పరిశీలించినట్లు తెలిపారు. పాఠశాలల్లో గల ఇంటరాక్టివ్ ప్యానల్స్ ని యూస్ చేస్తు రివిజన్‌లో పాఠ్యాంశాల బోధన జరుగాలని ఆయన సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను పర్యవేక్షించి ప్రత్యేక తరగతులను తీసుకొని వారిని పదవ తరగతిలో మంచి పలితాల సాధించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా తో పాటు జిల్లా విద్యాధికారి రాధాకిషన్, మండల విద్యాధికారి బుచ్యానాయక్, ఉపాధ్యాయులు సామ్యానాయక్ ,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జొన్న వరినాట్లను పరిశీలించిన అధికారి

**బొంరాస్‌పేట్, జనవరి27, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా వ్యవ సాయ అధికారి గోపాల్ దుద్యాల్ మండలం నాజ్‌ఖాన్‌పల్లి గ్రామంలో పర్యటించి జొన్న, వరినాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సంద ర్భంగా అయన మాట్లాడుతూ యాసంగి వరిలో ప్రధాన పొలానికి 20కిలోల యూరియా, 50కిలోల డిఏపి, 15కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను ఆఖరి దుక్కిలో వేయడంతోపాటు యాసంగి జిం క్‌దాతులోపం ఎక్కువగా ఉంటుంది. జింక్‌దాతులోపం కోసం ప్రధాన పొలంలో ఎకరానికి 20కిలోల జింకు సల్ఫేట్ బాస్వరం ఎరు వులతో కలపకుండా దుక్కిలో వేసుకోవాలని రైతులకు అయన సూచించారు. ఏఈఓ హేమ, గ్రామసర్పంచ్ శకనప్ప, రైతులు ఆశోక్, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రాజ్, కాశప్ప, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

**మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు ఎస్.నారాయన్‌రెడ్డి**

**పెద్దేముల్, జనవరి 27, ప్రభాతవార్త:** బాధిత కుటుంబానికి అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్య క్షుడు ఎస్.నారాయన్‌రెడ్డి అన్నారు. శనివారం పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన ఫకీర్ ఖాజమియ్య మృతిచెందటంతో ఆయన కుమారుడు మోనుకు రూ.5 వేలు ఆర్థిక సహాయం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.నారాయన్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు అదుకోవడానికి తనవంతు కృషిచేస్తానని అన్నా రు. భాధిత కుటుంబాలకు ఎస్.నారాయన్‌రెడ్డి అండగా నిలవడంతో పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్‌పార్టీ గ్రామ కమిటి అధ్యక్షుడు మైపూస్, గ్రామపెద్దలు ఆహ్మద్ తదితరులు ఉన్నారు.

# యువత క్రీడల్లో రాణించాలి

**మేడ్చల్ జడ్పిటిసి శైలజా విజయనందరెడ్డి**

**మేడ్చల్, జనవరి 27. ప్రభాతవార్త :** యువత క్రీడల్లో రాణిస్తే గుర్తిం పు సాదించడంతో పాటు ఉల్లాసం, దృఢత్వంతో ఉంటారని మేడ్చల్ జడ్పీటీసీ శైలజా విజయనందరెడ్డి, సర్పంచ్‌ల ఫోరా రాష్ట్ర ఉపా ధ్యక్షుడు విజయనందరెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని శ్రీరం గవరం గ్రామంలో సర్పంచ్ విజయనందరెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో రైజింగ్ బుల్స్ టీం విజేతగా గెలుపొందగా రన్నర్‌గా ఈగల్స్‌టీం సభ్యులు నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ యువత తనకిష్టమైన ఆటలను ఎంచుకుని అందులో ప్రావీణ్యా త సాధించాలన్నారు. నేడు చదువుతో పాటు క్రీడలు కూడ అవసర మని, క్రీడలతో శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం ఏర్ప డుతుందని తెలిపారు. ఆటలతో స్ఫూర్తి, క్రీడాకారుడికి గుర్తింపు వస్తుందని ప్రతి యువకుడు సమయం దొరికినప్పుడు క్రీడల్లో పాలొ ్గనాలని సూచించారు. క్రీడాకారుల అభ్యున్నతికి తమ వంతు సహ కారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యు డు ప్రకాష్, ఉప సర్పంచ్ నర్సింహ, వార్డు సభ్యులు నాగార్జు నరెడ్డి, ఉమారాణి, సరిత, రాధ, పద్మ, రాములు, మల్లమ్మ, యా దయ్య గౌడ్, నాయకులు ప్రకాష్‌రెడ్డి, భూపాల్, దేవేందర్‌రెడ్డి, పోచమ్మ, నర్సింహ, చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం

**మేడ్చల్, జనవరి 27. ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలోని రాజబొల్లారం తండాలో మెడిసిటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సర్పంచ్ మాంగ్యా నాయక్ సహకారంతో శనివారం ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ఈ శిభిరంలో సాధారణ జబ్బులతో పాటు చెవి, ముక్కు, గొంతు, కంటి పరీక్షలు, చర్మ సమస్యలు, ఊపిరితిత్తులు తదితర వాటిని పరీక్షలు జరిపారు. 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను ఉచితంగా అంద జేశారు. అందులో 32 మందిని ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు నిర్వహ కులు తెలిపారు. వార్డు సభ్యులు, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అమెచ్యూర్ గోల్ఫ్ టోర్నమెంట్ నిర్వహణ

శామిర్‌పేట జనవరి27, ప్రభాతవార్త : బిఎండబ్ల్యు అతిపెద్ద అమెచ్యూర్ గోల్ఫ్ టోర్నమెంట్ 2024 ఇండియా ఎడిషన్‌ను హైదరాబాద్‌లో నిర్వహించింది. ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న గోల్ఫ్ టోర్నమెంట్ చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లతో పలు నగరలో అద్భుతమైన గోల్ఫ్ కోర్స్‌లలో కొనసాగుతోంది. ప్రాంతీయ టోర్నమెంట్‌ల విజేతలు 2024 తదుపరి రోజులలో జరిగే జాతీయ ఫైనల్స్‌లో పోటీపడతారు. వెయ్యి క్వాలిఫైయింగ్ టోర్నమెంట్‌లతో గ్లోబల్ సిరీస్‌గా అభివృద్ధి చెందింది. ప్రతి దేశం నుండి అత్యుత్తమ ఆట గాళ్లు హైలెట్ అయిన బిఎండబ్ల్యు గోల్ఫ్ కప్ వరల్డ్ ఫైనల్‌కు అర్హత సాధిస్తారని వెల్లడించింది.

## నేడు యాచారంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి పర్యటన

**యాచారం జనవరి27, ప్రభాతవార్త :** ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పర్యటించనున్నట్లు ఎంపిడివో విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ... యాచారం మండల పరిధిలోని గడ్డ మల్లయ్య ,మల్కిజ్ గూడ ,తుమ్మలో గూడ గ్రామాలలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అభివృద్ధి పనులపై పర్యటించనున్నట్లు తెలిపారు. ఒక కోటి 70 లక్షల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు ప్రారంభోత్స వాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్ర మానికి ఎంపిపి కొప్పు సుకన్య భాష, జడ్పిటిసి చిన్నోళ్ల జంగమ్మ యా దయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొనున్నారు.

## గ్రామీణ బంద్ విజయవంతం చేయాలి

**వ్యకాస నాయకులు అంజయ్య**

**యాచారం జనవరి27, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న నిర్వహిస్తున్న గ్రామీణ బంధు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యకాస నాయకులు అంజయ్య పేర్కొన్నారు. శనివారం యాచారం మండల కేంద్రం లో ఎఐకెఎస్, ఎఐడబ్ల్యుయుడబ్ల్యు, సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వ ర్యంలో కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్ రెడ్డి హాజరై మా ట్లాడుతూ... .బిజెపి ప్రభుత్వం పేదలకు సమస్యలు పరిష్కరిం చక పోగా సంపన్నులకు కొమ్ముకాస్తున్నారని దుయ్యబట్టారు. నిత్య వస రాల ధరలు అకాశన్నంటాయని వాటిని నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. దీంతో ఫిబ్రవరి 16న నిర్వహించే గ్రామాల బంధును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్య క్షుడు అంజయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య, రైతు సం ఘం జిల్లా నాయకులు జంగయ్య, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

**అవసరాలకు అనుగుణంగా సేవలను అందించడమే లక్ష్యం**

శామిర్‌పేట జనవరి27, ప్రభాతవార్త : పేరుగాంచిన లెగసీ కంటెంట్ ప్రొడక్షన్ స్టూడియో బవేజా స్టూడియోస్ లిమిటెడ్ తన ఎస్ఎంఈ పబ్లిక్ ఇష్యు ద్వారా రూ.97.20 కోట్ల వరకు సమీకరించాలని యోచిస్తోంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వారి ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్ఫాంలో పబ్లిక్ ఇష్యూను ప్రారంభించడానికి కంపెనీ ఆమోదం పొందింది. పబ్లిక్ ఇష్యు జనవరి 29న ప్రారంభమై ఫిబ్రవరి 1న ముగిస్తుంది. సాధారణ కార్పొరేట్ అవసరాలతో సహా కంపెనీ విస్తరణ ప్రణాలికలకు వినియోగించనున్నట్లు తెలిపింది.

## నేడు పలు ప్రాంతాల్లో కరెంటు కోత

**శంషాబాద్ జనవరి27, ప్రభాతవార్త :** ఆదివారం ఉదయం 10 నుండి 1గంట వరకు వార్షిక నిర్వహణ కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సురేష్ రెడ్డి తెలిపారు. నిర్వహణ విద్యుత్ తీగల కింద చెట్ల కోత కోసం 33/11 కేవీ పెద్ద షాపూర్ కలాన్ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు తెలిపారు. పెద్దషాపూర్, పెద్ద షాపూర్ తండా, గం డిగూడ, ఘంసీమియా గూడ, గండి గూడ, ఆటోనగర్, మదనపల్లి పాత తండా, మనదపల్లి కొత్త తండా, మదనపల్లి గ్రామాలలో విద్యుత్ సరపరా అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించాలని సూచించారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**ఆదిభట్ల జనవరి27, ప్రభాతవార్త :** ఆదివారం మంగళపల్లి సబ్‌స్టేషన్ మరియు రామదాసు పల్లి సబ్ స్టేషన్ మరమ్మత్తుల కారణంగా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యు త్ సరఫ రాకు అంతరాయం ఉంటుందని ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజ నీర్ తెలిపారు. శనివారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ.... ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలైన బొంగులూరు ఎంపి పటేల్ గూడ, మంగళపల్లి సాహెబ్ గూడ, కొంగరకలాన్ ,రాందాస్ పల్లి చిం తపల్లి గూడ, మలిచెట్టి గూడ, శేరిగూడ, గ్రామాల గృహ, వాణిజ్య వ్యవసాయ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## సమ్మక్క సారలమ్మ దేవాలయంకు విరాళం



సమ్మక్క సారలమ్మ ఆలయ నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న దృశ్యం

**మర్కుక్, జనవరి 27 (ప్రభాతవార్త):**
రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా ఆలయానికి ప్రముఖ వ్యాపారవేత్త ఇనకొండ చంద్రారెడ్డి మర్కుక్ మండల బిసిసెల్ అధ్యక్షుడు మేకల కనకయ్య ఆధ్వర్యంలో లక్షా 1116 రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకొని మాట్లాడారు. ఆలయ అభివృద్ధి కోసం మావంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హర్షవర్ధన్, భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, మధు, దేవేందర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భరోసా కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు -జిల్లా న్యాయమూర్తి, ఎస్‌పిలు



భరోసా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి, జిల్లా ఎస్పి

**సంగారెడ్డి టౌన్, జనవరి 27, ప్రభాతవార్త:**
జాతయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్‌రావు, జిల్లా ఎస్‌పి సిహెచ్ రూపేష్ చెన్నూరిలు సంగారెడ్డి పట్టణంలోని భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భరోసా కేంద్రం పరిసరాలను ప్రత్యక్షంగా అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి హన్మంతరావు, మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి జి సుదర్శన్, అడిషనల్ ఎస్‌పి, డిఎస్‌పి, సిఐ పాల్గొన్నారు.

## ఆర్టీసి బస్సులు నడపాలని వినతి



నర్సాపూర్ ఆర్టీసి డిపో అధికారి లక్ష్మణ్ కు వినతి పత్రం ఇస్తున్న విధ్యార్థులు తదితరులు

**నర్సాపూర్, జనవరి 27.ప్రభాతవార్త:**
నర్సాపూర్ నుండి జిన్నారం మీదుగ ఆర్టీసి బస్సులు నడపాలని కోరుతూ ఎరువుల శ్రీనివాస్ అధ్వర్యంలో విద్యార్థులు శ్రావణి, శ్రీలత, అభయ్‌కుమార్ తదితరులు నర్సాపూర్ ఆర్టీసి డిపో అధికారి లక్ష్మణ్‌కు ఒక వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నర్సాపూర్ నుండి జిన్నారం మీదుగా బస్సులు నడపక పోవడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు బస్సులు లేకపోవడంతో కాలేజీలకు వెళ్లడానికి అనేక ఇబ్బందులుపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్టీసి డిపో అధికారులు స్పందించి నర్సాపూర్ నుండి జిన్నారం మీదుగా బస్సులను నడపాలని వారు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈవషయమై నర్సాపూర్‌ఆర్టీసి డిపో అధికారి లక్ష్మణ్ అడగగా ప్రస్తుతానికి రెండు బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. అంతేగాక డ్రైవర్ లు లేక పోవడంతో బస్సులు వేయడంలో ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. అయినా ఉన్నాతాధికారులతో చర్చించి త్వరలో ఈ రూట్లో ఆర్టీసి బస్సులు నడిపే విదంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## శ్రీకాంతాచారి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలు చేపడతాం

**నర్సాపూర్, జనవరి 27.ప్రభాతవార్త:**
శ్రీకాంతాచారి చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో మరిన్ని సామాజిక సేవ కార్యక్రమాలు చేపడతామని వడ్ల శ్రీలేఖ శ్రీకాంతాచారి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీకాంతాచారి తెలిపారు. ఈ మేరకు 75 వ గణతంత్రదినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని రుస్తుంపేట జడ్‌పిహెచ్ఎస్ స్కూల్, ప్రాథమిక పాఠశాల లో విద్యార్థుల కు ఫుడ్, అండ్ పెన్సిల్ కిట్స్ తో పాటు తదితర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వడ్ల శ్రీలేఖ శ్రీకాంతాచారి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీకాంతాచారి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మొట్టమొదటగా ఈ పాఠశాలలోని విద్యార్థులకు ఈవస్తువులను పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. కాగా ఇక ముందు ముందు మరిన్ని సమాజసేవా కార్యక్రమాలను చేపడతామని ఆయన వెల్లడించారు. ఈకార్యక్రమంలో రుస్తుంపేట గ్రామ సర్పంచ్ విజయబాస్కర్ రాజు, చండి ప్రసాద్, రాములు, శ్రీకాంత్, శ్రీశైలం మల్లేష్, మురళీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో మట్కా నిర్వాహకులు



పోలీసుల అదుపులో మట్కా నిర్వాహకులు

**జహీరాబాద్, జవవరి 27, ప్రభాతవార్త:**
జహీరాబాద్ రూరల్ పోలీసు ఠాణా పరిధిలోని రంజోల్ గ్రామంలో ప్రభుత్వం నిషేదించిన మట్కా ఆడుతున్న నలుగురిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. మట్కా ఆడుతున్న యం కృష్ణ (40), కంటి రవి (38), కంటి రాజు (49), కురేషి యాదుల్ (40)లను టాస్క్‌ఫోర్స్ బృంధాలు దాడులు నిర్వహించి మట్కా ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని పోలీసు ఠాణాకు తరలించారు. మట్కా అడిన వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## గొర్రెల పెంపకదారుల సంఘం అధ్యక్షుడిగా నరేష్

**బంట్వారం, జనవరి 27 (ప్రభాతవార్త) :** మండల పరిధిలోని మాల సోమారం గ్రామ గొర్రెల పెంపకదారుల సంఘం అధ్యక్షునిగా ఆమ్రా ది నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి మోహిత్ మహ మ్మద్ అలీ శనివారం ప్రకటించారు. అయితే ఈ సంఘం ఎన్నికల నిర్వహించవలసి ఉండగా నామినేషన్ ్ల ఒకటే సెట్ వేయడంతో పోటీదారులు లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన ్నకోవడం జరిగిందని తెలియజేశారు. అదేవిధంగా సంఘం ఉపాధ్యక్షునిగా పీజీ పాండ య్య, కార్యదర్శి ఆలంపల్లి అశోక్, సభ్యులుగా పెద్దగొల్ల సత్తెమ్మ, పెద్ద గొల్ల పుష్పమ్మ, పెద్దగొల్ల రాచయ్య తండ్రి కిష్టయ్య, పెద్దగొల్ల మహేష్ పెద్దగొల్ల నరసింహులు పెద్దగొల్ల రాచయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గొర్రెల పెంపకదారుల సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల స్థానిక సర్పంచ్ నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువ జన విభాగం కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డిలు వారిని అభినందించారు. సంఘం అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని అధ్యక్షుడు నరేష్ పేర్కొన్నారు.

## హుస్నాబాద్ జెఏసి నూతన కమిటీ ఎన్నిక

-కన్వీనర్‌గా కవ్వ లక్ష్మారెడ్డి, కోఆర్డినేటర్‌గా మేకల వీరన్న యాదవ్



నూతన కార్యవర్గం దృశ్యం

**హుస్నాబాద్, జనవరి27, ప్రభాతవార్త**

హుస్నాబాద్ నియోజకవర్గ జాయింట్ యాక్షన్ కమిటి నూతన కార్యవర్గాన్ని శనివారం రోజున ఎన్నుకున్నారు. పట్టణ కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఉద్యమకారులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజా సంఘాల నాయకులు ఏకమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నియోజకవర్గ కన్వీనర్‌గా కవ్వ లక్ష్మారెడ్డి, కోఆర్డినేటర్లుగా మేకల వీరన్న యాదవ్, ద్యాగల సారయ్య, కోకన్వీనర్లుగా కొమురయ్య, ముక్కెర సంపత్, శ్రీనివాస్, జంపన్న, జగదీశ్వర చారి, షేక్ హుస్సేన్, రమణయ్య, రవిందర్‌రెడ్డి, కుమారస్వామి, ప్రకాష్, తిరుపతి, మోహన్‌నాయక్, బాబు, భూపతిరెడ్డి, కొమురెల్లి, కనుకయ్యలతో పాటు కార్యవర్గ సభ్యులుగా ప్రొఫెసర్ వీరన్న నాయక్, నాగరాజు, పోలోజు రాజ్‌కుమార్, వీరయ్య. వడ్డెపల్లి మల్లేశం, ఎల్లయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్‌వినిత్, ఎల్లయ్య, వెంకటర మణారెడ్డి, ఫ్రాన్సిస్, కుమారస్వామి, సంపత్‌కుమార్, చంద్రశేఖర్, మహేందర్, శ్రీనివాస్, ప్రభాకర్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

**-ఎమ్మెల్సీ నియామకం పట్ల హర్షం...**

తెలంగాణ ఉద్యమ నాయకులు ప్రొఫెసర్ కోదండారాంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియామకం పట్ల హుస్నాబాద్ జాయింట్ యాక్షన్ కమిటి హర్షం వ్యక్తం చేసింది. ఈనేపథ్యంలో హైదరాబాద్‌లోని కోదండారామ్ నివాసం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ జెఏసి నాయకులతో పాటు నియోజకవర్గ నాయకులు ఎదులాపురం తిరుపతి, ప్రకాష్, నాగరాజు, శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, రాజ్‌కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన హుస్నాబాద్ న్యాయవాదులు



.పార్టీలో చేరిన న్యాయవాదులకు కండువాకప్పి స్వాగతం పలుకుతున్న సంజయ్

**హుస్నాబాద్, జనవరి27, ప్రభాతవార్త**

బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌కుమార్ సమక్షంలో శనివారం రోజున హుస్నాబాద్ న్యాయవాదులు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టు న్యాయవాదులు పిట్టల దేవదాసు, విలాసాగరం మరళిమోహన్, బాలరాజు, మాదవిలు పార్టీలో చేరగా వారికి సంజయ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన న్యాయవాదులు హుస్నాబాద్ కోర్టుకు సంబంధించిన పలు సమస్యలను సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కొత్తపల్లి దేవేందర్, న్యాయవాదులు అజయ్‌కుమార్, సంపత్, శ్రీదేవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు 50వేల సిసి కెమేరాల వితరణ



అశోక్‌ను శాలువాతో సత్కరిస్తున్న దృశ్యం

**అక్కన్నపేట, జనవరి27, ప్రభాతవార్త**

అక్కన్నపేట మండలంలోని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సిసి కెమేరాలు లేవని విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థి కర్ణకంటి అశోక్ శనివారం రోజున పాఠశాలకు రూ 50వేల విలువ చేసే కెమేరాలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నతనంలో ఇదే పాఠశాలలో తాను విద్యాబుద్దులు నేర్చుకున్నానని, తనవంతు సహకారం పాఠశాలకు చేయాలనే ఉద్దేశంతో ఈ కెమేరాలు అందించినట్లు తెలిపారు. పాఠశాలకు ఇక నుండి ఎలాంటి సహాయం కావాలన్నా తనవంతు సహకారం ఎప్పటికి ఉంటుందన్నారు. పాఠశాలకు కెమేరాలు అందించిన అశోక్‌ను పాఠశాల ప్రధానోపాద్యాయులు లింగాల శైలజరెడ్డితో పాటు ఉపాధ్యాయ బృధం, ఎస్ఎమ్‌సి చైర్మెన్‌తో పాటు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ శాలువాతో సత్కరించారు.

## ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి

-చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఆడపడుచులకు చెక్కులు అందచేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నాగల్‌గిద్ద, జనవరి 27, ప్రభాతవార్త:** ఆడపడుచుల వివాహాలకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన నాగలగిద్దలో లబ్దిదారులకు చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందచేస్తున్నామన్నారు. గత బిఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ శ్రేణులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందచేయలేదని గుర్తు చేశారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్‌రావు పాటిల్, జడ్పీటిసి సభ్యులు రాజు రాథోడ్, వైస్ ఎంపిపి అధ్యక్షులు పండరి యాదవ్, ఆర్‌డిఓ వెంకటేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భోజిరెడ్డి, సొసైటీ చైర్మన్ శ్రీకాంత్, వైస్ చైర్మన్ అంజిరెడ్డి, తహసీల్దార్ షబానా, డిప్యూటీ తహసీల్దార్ శివకృష్ణ, ఎంపిడిఓ కవ్‌లాజ్ రాజశేఖర్, సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

**తెలంగాణ మోడల్ పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే**

మండలంలోని మోరిగి గ్రామంలోని మోడల్ పాఠశాలను, వసతి గృహాన్ని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ పి సంజీవరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. పాఠశాలకు కావాల్సిన వివరాలను పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్‌ను అడిగితెలుసుకున్నారు. పాఠశాలకు త్రిఫేజ్ విద్యుత్, వంట గది, పాఠశాల నుంచి వసతి గృహం వరకు సిసి రోడ్డు, వసతి గృహానికి భగీరథ నీటి సరఫరాకు పైప్‌లైన్ అవసరమని ప్రిన్సిపల్ రమేష్ తన దృష్టికి తెచ్చారని, త్వరలోనే సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వివరించారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తం అవసరం

**-విద్యార్థి దశ నుండే అవగాహన పెంచుకోవాలి**
**-గజ్వేల్ ఏసిపి రమేష్‌బాబు**



ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న గజ్వేల్ ఏసిపి రమేష్

**గజ్వేల్, జనవరి 27 (ప్రభాతవార్త):**

విస్తరిస్తున్న ప్రపంచంలో సైబర్ నేరాల నుండి తప్పించుకోలేని పరిస్థితులు నెలకొన్నట్లు గజ్వేల్ ఏసిపి రమేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం ప్రజ్ఞాపూర్‌లో సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసిపి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థి దశ నుండే సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అలాగే వారితోనే మార్పు సాధ్య పడుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా సోషల్ డైలామా డాక్యుమెంటరీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగివుండాలని, నిర్లక్ష్యం చేస్తే సైబర్ నేరాలు భవిష్యత్తులో తీవ్ర రూపం దాల్చే ప్రమాదం ఉన్నట్లు హెచ్చరించారు. దురాశతోనే మోసపోవడం జరుగుతుండగా మంచి భవిష్యత్తు కోసం విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని తెలిపారు. సెల్‌ఫోన్, టెలీవిజన్ వంటి వాటికి దూరంగా ఉంటే ఉన్నత స్థాయికి ఎదగడం సులభమని తెలిపారు. ప్రజలకు అవగాహన లేని కారణంగా ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ క్రైమ్ అతివేగంగా వ్యాపిస్తున్నట్లు పేర్కొన్నారు. కరోనా సమయంలో ఆన్‌లైన్ షాపింగ్, ఆన్‌లైన్ విద్యాబోధన, ఉద్యోగులు వర్క్ ఫ్రం హోం చేయడం, ఆన్‌లైన్ గేమ్స్ డౌన్లోడ్ చేయడం వల్ల సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలిపారు. సైబర్ నేరాల భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్స్ ఆహుతులను ఆకట్టుకోగా విద్యార్థుల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తున్న సెయింట్‌మేరీ విద్యాసంస్థల చైర్మన్ ఇన్నారెడ్డిని ప్రశంసించారు. సైబర్ క్రైమ్స్ సెక్యూరిటీ వింగ్ సిఐ శేఖర్ మాట్లాడుతూ మనకు వచ్చే సమాచారాన్ని దృవీకరించుకున్న తర్వాతే ఇతరులకు పంపించాలని, సోషల్ నెట్‌వర్క్ ఖాతాలోకి నకిలీ ప్రొఫైల్స్, స్నేహితుల సమాచారాన్ని పోస్ట్ చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రెస్మా నేతలు రాఘవేందర్‌రెడ్డి, సోమేశ్వర్‌రెడ్డి, సెయింట్ మేరీస్ కరస్పాండెంట్ చంటి, ఇన్నారెడ్డి, ప్రిన్సిపాల్ రాయప్ప, విజయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిసిలను ఆర్థిక, రాజకీయంగా అణచివేసింది బిఆర్ఎస్ కాదా.?

**-బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు ఐలేష్‌యాదవ్**

**హుస్నాబాద్, జనవరి27, ప్రభాతవాత్త**

తెలంగాణ రాష్ట్రంలో బిసిలను ఆర్థికంగా, రాజకీయంగా అణచివేసింది బిఆర్ఎస్ పార్టీ కాదా అని బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు గొర్ల ఐలేష్‌యాదవ్ మండిపడ్డారు. శనివారం రోజున హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబాపూలే విగ్రహాన్ని అసెంబ్లీలో ఏర్పాటు చేయాలని పోస్టు కార్డుల ఉద్యమం చేపడతామని ఎమ్మెల్సీ కవిత అనడం సిగ్గుచేటన్నారు. గత 10ఏండ్ల బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సిఎం కెసిఆర్ కుటుంబానిని బిసిలు, మేదావులు ఎందుకు గుర్తుకురావలేదని విమర్శించారు. మంత్రి వర్గంలో బిసిలకు ముగ్గురికే మంత్రి పదవులు ఇచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రగతి భవన్‌కు మహాత్మ జ్యోతిబాపూలే భవన్‌గా నామకరణం చేసి ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో వేలాధి కోట్ల రూపాయలు సంపాదించిన కవితకు బిసిల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. ఇప్పటికైనా కవిత, బిఆర్ఎస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోకుంటే తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, కేడం లింగమూర్తి, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సముద్రాల పద్మ, మేకల అశోక్ యాద్, బంక చందుయాదవ్, వల్లపు రాజుయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, అశోక్‌యాదవ్, పచ్చిమట్ల శ్రీకాంత్‌గౌడ్, బోనగిరి రజిత, పెరుమండ్ల నర్సాగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, గుంపుల శ్రీనివాస్, జంగం యాదయ్య, చేర్యాల తిరుపతి, కుర్ర మల్లయ్య యాదవ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం : ఎంపిడిఓ జయలక్ష్మి




మండల సభలో మాట్లాడుతున్న ఎంపిడిఓ జయలక్ష్మి

**పుల్కల్, జనవరి 27, ప్రభాతవార్త:**

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి పనులకు సంబంధించి ప్రతిపాదనలు త్వరిత గతిన అందచేయాలని ఎంపిడిఓ జయలక్ష్మి సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్లాక్ పంచాయితీ అభివృద్ధికి ప్రణాళిక సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సమావేశానికి ఎంపిటిసి, సర్పంచులు హాజరు కాగా ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రాదాన్యత క్రమంలో చేపట్టే పనులను ముందుగా గుర్తించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న నిధులతో గ్రామాల్లో చేపట్టే పనులపై వివరించారు. పంచాయితీలకు ఈడా సామాగ్రి మంజూరు అయినా పంపిణి చేయకపోవడం పట్ల గ్రామాల సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల వచ్చిన వెంటనే అందచేస్తామని ఎంపిడిఓ వివరించారు. శివంపేట గ్రామానికి మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని, 5 ఏండ్లు పూర్తి కావస్తున్నా గ్రామస్థులకు తాగు నీరు సరఫరా చేయలేకపోయామని సర్పంచ్ పి రాజిరెడ్డి, ఎంపిటిసి సభ్యులు కలాలి కిరణ్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నష్టపరిహారంపై ఆర్‌డిఓ నివృత్తి

**మనూర్, జనవరి 27, ప్రభాతవార్త:**

నిజాంపేట-బీదర్ జాతీయ రహదారి 1618 నిర్మాణంలో భాగంగా శనివారం ఆర్‌డిఓ మండలంలోని బాదల్‌గావ్ భూసేకరణ అవార్డ్ ఎంక్వైరీకి సంబంధించి ఆర్‌డిఓ ఎన్ వెంకటేష్ ఆధ్వర్యంలో సభను నిర్వహించారు. రైతుల నుంచి సేకరిస్తున్న భూమి గురించి అందుకు సంబంధించిన నష్టపరిహారం గురించి ఆర్‌డిఓ రైతుల ప్రశ్నలకు నివృతి చేశారు. కార్యక్రమంలో డిఈ ఆర్అండ్‌బి రామకృష్ణ, మండల డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ మొఘ్ని, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## లారీ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన



లారీ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**మునిపల్లి, జనవరి 27, ప్రభాతవార్త:**

మండలంలోని బుధేరా గ్రామం తాజ్ ధాబా వద్ద శనివారం 35వ జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలను పురష్కరించుకుని మునిపల్లి ఎస్ఐ యేసయ్య, ఎల్అండ్‌టి సిబ్బంది లారీ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రైవర్లకు కరపత్రాలు అందించి తగు సూచనలు చేశారు. ద్విచక్ర వాహన దారులు విధిగా హెల్మెట్‌ను ధరించాలని వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఎల్అండ్‌టి సిబ్బంది, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

## గద్దర్ విగహం కొరకు అమరణ నిరాహార దీక్ష



గద్దర్ విగహం కొరకు అమరణ నిరాహార దీక్ష చేస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, జనవరి 27, ప్రభాతవార్త:** తెల్లాపూర్ మున్సిపాలిటిలో పార్టీలకు అతీతంగా ప్రజా గాయకులు గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో హెచ్ఎండిఏ అధికారులు అడ్డుకోవడాన్ని నిరిసిస్తూ అమరణ నిరాహార దీక్షకు పూనుకున్నట్లు తెల్లాపూర్ స్వతంత్ర కౌన్సిలర్ కొల్లూరి భరత్ తెలిపారు. శనివారం తెల్లాపూర్ చౌరస్తా వద్ద కొల్లూరి భరత్ చేపట్టిన నిరాహార దీక్షకు ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి. ప్రజాప్రతినిధలు సభలో విగ్రహం ఏర్పాటుకు తీర్మానం చేశారని, అయినా అధికారులు అడ్డుకునేందుకు కుట్రలు పన్నడం తగదని హెచ్చరించారు. గద్దర్ విగ్రహం ఏర్పాటుకు అధికారులు వెంటనే అనుమతులు జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారరు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, జనవరి 27 (ప్రభాతవార్త):**

మండలకేంద్రం మర్కుక్‌కు చెందిన సూర్వి ఆంజనేయులు అనారోగ్యం కారణంగా మృతిచెందగా విషయం తెలుసుకున్న గ్రామ పురోహితులు అప్పాల మాధవ్‌శర్మ శనివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు డాక్టర్ సహదేవ్‌గౌడ్, నవీన్, సూర్వి బాలనర్సయ్య, భూషణం, శ్రీనివాస్‌గౌడ్, శశి తదితరులు ఉన్నారు.

## కరపత్రాన్ని ఆవిష్కరించిన టిపిటిఎఫ్



విద్యా సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

**పాపన్నపేట, జనవరి 27, ప్రభాతవార్త:**

ఫిబ్రవరి 4న మెదక్ ద్వారకా గార్డెన్‌లో నిర్వహించే విద్యా సదస్సును, ఫిబ్రవరి 11, 12న నిర్వహించే విదాన వైజ్ఞానిక మహా సభలను విజయవంతం చేయాలని టిపిటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సంగయ్య, వెంకట్‌రామ్‌రెడ్డిలు కోరారు. శనివారం మండలంలోని ఆయా ఉన్నత పాఠశాలలను సందర్శించి సదస్సును విజయవంతానికి ఉపాధ్యాయులను చైతన్యం చేశారు. మెదక్‌లో నిర్వహించే సదస్సుకు శాసన సభ్యులు రోహిత్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, నర్సింహారెడ్డి, వేణుగోపాల్‌లు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ దర్శిని ఎడిటర్ శశిధర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు హీరా లాల్ జిల్లా ఉపాధ్యక్షులు గోపాలన మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాల్‌రాజ్, రమేష్, నాయకులు వీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయానికి కొత్త కమిటీ వేయాలి

**11 ఏళ్ళుగా నడుస్తున్న కార్యవర్గాన్ని రద్దు చేయాలి**

**రామాయంపేట, జనవరి 27, ప్రభాతవార్త :**

రామాయంపేట పట్టణంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి ప్రస్తుతం నడుస్తున్న కమిటీని రద్దుచేసి కొత్త కమిటీని వేయాలని పట్టణానికి చెందిన పలువురు వ్యక్తులు కోరుతున్నారు. ఇటీవల ఒక వైశ్య సంఘం నేత, మాజీ కిరాణా వర్తక సంఘం నాయకుడు వెంకటేశ్వర స్వామి గుడికి ప్రస్తుతం ఉన్న కమిటీని రద్దుచేసి కొత్త కమిటీని వేయాలని కోరుతూ ఇటీవల రామాయంపేట సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా ఆ విషయం పట్టణంలో చర్చనీయాంశమైంది. అయితే వెంకటేశ్వర స్వామి దేవాలయ కార్యవర్గాన్ని ఎన్నుకొని 11 సంవత్సరాలు అవుతుందని, కావున వెంటనే ప్రస్తుతం నడుస్తున్న కార్యకవర్గాన్ని రద్దుచేసి కొత్త కమిటీని వేయాలని పలువురు కోరుతున్నారు. 11 సంవత్సరాల పాటు వెంకటేశ్వరస్వామి గుడికి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోకపోవడం రామాయంపేట పట్టణంలో చర్చనీయ అంశం అయింది.

## జొన్న పంటలను పరిశీలించిన అధికారులు



జొన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

**సిర్గాపూర్, జనవరి 27, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో రైతులు సాగు చేస్తున్న జొన్న పంటలను వ్యవసాయ అధికారులు శశాంక్, సంగమ్‌లు పరిశీలించారు. జొన్న పంటకు సోకిన తెగులు నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా కల్మేర్ డిసిఎంఎస్, బిబపేట సొసైటీ, మార్డి గ్రామాలను సందర్శించి ఎరువుల నిల్వలను పరిశీలించారు. యాసంగి సీజన్‌లో ఎరువులకు లోటులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు జ్ఞానదేవ్, బాబు నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సలహాదారు షబీర్ అలీకి సన్మానం



షబ్బీర్ అలీని సన్మానిస్తున్న దృశ్యం

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 27, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బిసీ, మైనార్టీ శాఖలకు సలహాదారుడిగా షబ్బీర్ అలీని నియమించడం పట్ల టిపిసిసి మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎంఎ హకీమ్, యువజన కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు రియాజ్ అలీలు పూల బొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## కరపత్రాన్ని ఆవిష్కరించిన టిపిటిఎఫ్

**సంగారెడ్డి మున్సిపాలిటి, జనవరి 27, ప్రభాతవార్త:**

ఫిబ్రవరి 11, 12వ తారీఖులలో ఖమ్మం పట్టణంలో జరిగే టిటిటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని డిఈఓ వెంకటేశ్వర్లు శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిటిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ మాట్లాడుతూ మహాసభలకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలిరవాలని సూచించారు. కార్యక్రమంలో టిపిటిఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండలాల బాధ్యులు లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, విజయ్‌భాస్కర్, మర్రి ప్రశాంతి, మల్లికార్జున్, శంకర్, సురేఖ, లింబాజి, మనిదీప్, దండు అంజయ్య, వహీద్‌పాషా, రవీందర్, జనార్ధన్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడిగా నరేందర్ ఎన్నిక

**మెదక్ అర్బన్, జనవరి27 ప్రభాతవార్త:**

టీఎన్జీవో జిల్లా అధ్యక్షులుగా దొంత నరేందర్ రెండవ సారి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి తోట నీలకుమార్ ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. అసోసియేట్ అధ్యక్షులుగా ఇక్బాల్ పాషా, ప్రధాన కార్యదర్శిగా రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా మనోహర్, ఫణిరాజ్, ఫజల్, హర్షద్, రఘునాథ్‌రావవు, లీలా, సంయుక్త కార్యదర్శులుగా శంకర్, చిరంజీవచార్యులు, శివాజీ, కిరణ్‌కుమార్, రాధ, కార్యాలయ కార్యదర్శిగా సలీం, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శిగా గోపాల్, కోశాధికారిగా శేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా విష్ణువర్ధన్, పబ్లిసిటీ కార్యదర్శిగా నర్సింలు, ఈసీ సభ్యులుగా మరియా, శ్రీదేవిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాలోని అన్ని యూనిట్ల బాధ్యులు ఘనంగా సన్మానించారు.

## గావ్ ఛలో అభియాన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

**-మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్**



మాట్లాడుతున్న మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్

**పెద్దశంకరంపేట, జనవరి27 ప్రభాతవార్త:**

ఫిబ్రవరి 4వ తేదీ నుండి 11వ తేదీ వరకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న గావ్ ఛలో అభియాన్ (పల్లెకు పోదాం అభియాన్) కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పెద్దశంకరంపేట మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్ అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పేదల సంక్షేమం, మహిళా సాధికారత, అంతర్గత బాహ్య భద్రత, సాంస్కృతిక పునరుద్ధరణ తదితర అంశాల్లో భారతదేశ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా గత పది సంవత్సరాలుగా ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో భారతదేశం ఎన్నో రంగాల్లో అసాధారణ అభివృద్ధి సాధించిందని వివరించారు. పల్లెకు పోదాం అభియాన్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ కార్యకర్తలు తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి గ్రామ బూత్ స్థాయిలో ప్రజలందరికీ వివరించాలన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ సహ విస్తారక్‌గా రాచర్ల అశోక్ అందరికీ అందుబాటులో ఉంటారని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు శ్రావణ్ కుమార్, మంగలి కృష్ణ, మహేష్, బుగుడాల కృష్ణ, అనిల్, సుభాష్, సురేష్, అంజయ్య, రాజు, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధికి ఎనలేని కృషి

**-మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి**



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాలకవర్గం

**గజ్వేల్, జనవరి 27 (ప్రభాతవార్త):**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పాలకవర్గం నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తమ తోటి పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి పేర్కొన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాను మున్సిపల్ చైర్మన్‌గా ఉండి నాలుగు సంవత్సరాల వ్యవధిలో దేశంలోనే గజ్వేల్‌కు గుర్తింపు తీసుకువచ్చిన ఘనత దక్కడం సంతోషంగా ఉందన్నారు. మాజీ ముఖ్య మంత్రి చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి హరీష్‌రావుల సారధ్యంలో మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేశామన్నారు. రాష్ట్రంలోనే మున్సిపాలిటీకి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో పాలకవర్గంతో కలిసి కృషి చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని, అభివృద్ధిలో నాతో పాటు మున్సిపల్ పాలకవర్గం తోడ్పాటునందించడం సంతోషంగా ఉందన్నారు.

## ఇసుక డంప్‌లపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల రైడ్

**గజ్వేల్, జనవరి 27 (ప్రభాతవార్త):** ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక డంప్ చేసినట్లు నమ్మదగిన సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకొని డంప్ నిర్వాహకుడు అమర నరేందర్‌పై కేసు నమోదు చేశారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఎవరైనా అక్రమంగా ఇసుక నిల్వలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మున్సిపల్ పరిధిలోని పలు కిరాణా దుకాణాలపై రైడ్ చేసి రేషన్ బియ్యం పట్టుకున్నారు. రేషన్ బియ్యం అమ్మినా, కొన్నా చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని, రేషన్ బియ్యం అమ్మిన వారిపై సైతం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు నరేష్, రమేష్‌లు మాట్లాడుతూ పట్టణాలలో, గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా చేసినా, పిడిఎఫ్ రైస్ అక్రమంగా దాచిపెట్టినా, పేకాట మరేదైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిదినదపేట పోలీస్ కమిషనర్‌కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

## కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి అభినందనీయం

### -ప్రభుత్వానికి మంజీర రైతు కృతజ్ఞతలు



విలేఖరులతో మాట్లాడుతున్న మంజీర రైతు సమాఖ్య అధ్యక్షులు

**సదాశివపేట, జనవరి 27, ప్రభాతవార్త:**
ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం వహించిన జేఏసి చైర్మన్, ప్రొఫెసర్ కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి కేటాయిచడం అభినందనీయమని, కోదండరాంకు ఎమ్మెల్సీని అందచేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల పృథ్వీరాజ్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సదాశివపేటలోని రైతు సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో రైతు సమాఖ్య నాయకులతో కలిసి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధనలో కీలకంగా వ్యవహరించిన కోదండరాంకు సరైన పదవి అప్పగించారని కొనియాడారు. కార్యక్రమంలో రైతు సమాఖ్య నాయకులు పి రవిందర్, డి జైపాల్, పి బస్వరాజ్, పి రాంరెడ్డి, విశ్వనాథం, ఈశ్వర్‌రెడ్డి, పరశురాం, లింగం తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ చర్చికి కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర



మెదక్ చర్చికి పాదయాత్రగా వెళుతున్న కాంగ్రెస్ నాయకులు

**చౌటకూరు, జనవరి 27, ప్రభాతవార్త:**
అందోల్ శాసన సభ స్థానం నుంచి దామోదర్ రాజనర్సింహా విజయం సాధిస్తే మెదక్ చర్చిని దర్శించుకుంటామన్న కాంగ్రెస్ నాయకులు ఆదివారం తమ మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గ్రామం నుంచి మెదక్‌కు పాదయాత్రగా బయలు దేరారు. దామోదర్ రాజనర్సింహా శాసన సభ్యులుగా విజయం సాధించడంతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, సైన్స్ టెక్నాలజీ మంత్రిగా బాధ్యలు స్వీకరించడం ఆనందంగా ఉందని గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు మహేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు.

## చిలెపల్లి విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ

**ఝరాసంగం, జనవరి 27, ప్రభాతవార్త:**
మండలంలోని చిలెపల్లి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం విద్యా సామాగ్రి (నోటు బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, చాట్‌లు) అందచేశారు. పంచాయితీ వార్డు సభ్యులు ఇస్మాయిల్ కుమారుడు మాజిద్ తన స్వంత నిధులతో విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందించారు. ఈ సందర్భంగా మాజిద్ మాట్లాడుతూ తాను సైతం ఇదే పాఠశాలలో విద్యను అందుకున్నానని, బిటెక్ విద్యను అందుకుంటున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యను అందుకోవాలని మాజిద్ సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై అమృత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో సురూవైన బిజెపి ప్రచారం



నియోజకవర్గంలో కొనసాగుతున్న బిజెపి నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ప్రచారం

**జహీరాబాద్/న్యాల్‌కల్, జనవరి 27, ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్న భారతీయ జనతా పార్టీ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి జహీరాబాద్ శాసన సభ నియోజకవర్గంలో తన ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ చేసిన వీడియోను వాహనంపై ఏర్పాటు చేసిన ఎల్ఈడి స్క్రీన్‌పై ప్రదర్శిస్తున్నారు. డివిజన్ పరిధిలోనిలోని న్యాల్‌కల్, ఝరాసంగం, మొగుడంపల్లి, కోహీర్, జహీరాబాద్, రాయికోడ్ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో వాహనంను తిప్పుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఎల్లారెడ్డికి చెందిన వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రచారం పట్ల బిజెపి నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ మారు జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బిజెపి అభ్యర్థి విజయమే లక్ష్యంగా పని చేస్తామని నియోజకవర్గం బిజెపి నాయకులు, కార్యకర్తలు అంటున్నారు.

## ఓల్డ్ ఎంఐజి కాలనీలో బస్తీ దర్శన్

### -పాల్గొన్న కార్పోరేటర్, అధికారులు

**రామచంద్రాపురం, జనవరి 27, ప్రభాతవార్త:** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఓల్డ్ ఎంఐజి కాలనీలో శనివారం బస్తీ దర్శన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి భారతీ నగర్ డివిజన్ కార్పోరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి జలమండలి, ఇంజనీరింగ్ అధికారులతో కలసి బస్తీలో కలియతిరుగుతూ ప్రజల నుంచి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి కాలనీలో ఇటీవల వేసిన డ్రైనేజీ లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ అసరమైన ప్రాంతాల్లో రోడ్లు వేయాలని, అవసరమైన చోట డ్రైనేజీ లైన్‌లో అన్ని మ్యాన్ హోల్స్‌లకు ప్రతిపాదనలు చేయాలని సూచించారు. కాలనీలో సిసి రోడ్లు ప్రారంభించని చోట రీ టెండర్‌కు కాల్ చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు త్వరగా నాణ్యవంతంగా పూర్తి చేయాలని సూచించారు. బస్తీ దర్శన్‌లో తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కారనక్రమంలో జలమండలి ఏఈ సుబ్రమణ్యం, ఇంజనీరింగ్ డిఈ రమేష్, కాలనీ అధ్యక్షులు వెంకట్‌రావు, కార్యదర్శి సుబ్బారావు, డైరెక్టర్లు నారాయణ, నీలకంఠ, డివిజన్ అధ్యక్షులు భాస్కర్ ముదిరాజ్, వార్డు సభ్యులు తిలావత్, బిఆర్ఎస్ నాయకులు సంపత్, చిన్న, మహిళా అధ్యక్షురాలు జ్యోతి, మాజీ కౌన్సిలర్ నాగమణి, స్వర్ణ, లత, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



ఓల్డ్ ఎంఐజి కాలనీలో బస్తీ దర్శన్‌లో పాల్గొన్న కార్పోరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి

# పేదలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**కంగ్టి, జనవరి 27 ప్రభాతవార్త:**
పేదలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి అన్నారు. శనివారం కంగ్టి మండలానికి సంబంధించిన ఆయా గ్రామాలకు చెందిన కళ్యాణ లక్ష్మీ, శాదిముభారక్ చెక్కులను ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి చేతుల మీదుగా లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి చెక్కులు అత్యధికంగా కంగ్టి మండలంలోనే ఇచ్చామన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి చెంది న వారికి కళ్యాణ లక్ష్మి చెక్కులను ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశానుసారంతో ఉన్నటు వంటి చెక్కులను ఇచ్చి వేయాలన్నారు. ఆధార్ కార్డులో ఎలాంటి లోటుపాట్లు ఉన్న సరిచేసి మీ దగ్గర నిర్లక్ష్యం ఆపకుండా పంపివేయాలని అన్నారు. అదేవిధంగా గ్రామాలలోని సమస్యలకు చాటింపు చేసి గ్రామ సభ నిర్వహించి సరైన లబ్దిదారులకు ప్రభుత్వ పథకాల్లో ఎలాంటి అవినీతి జరగకుండా ప్రజలకు వెనుకబడిన వారికి పథకాలు చెందాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విష్ణుసాగర్, డీటీ తహశీల్దార్ జుబేర్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## జాతీయస్థాయిలో పథకాలు సాధించి సిద్దిపేటకు మంచి పేరు తేవాలి :ఎమ్మెల్యే హరీష్‌రావు



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న మాజీ మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేట రూరల్, జనవరి 27, ప్రభాతవార్త :**
ఇటీవల హైదారాబాద్‌లో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన 37వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ తైక్వాండో ఛాంపియన్షిప్‌లో సిద్దిపేట తైక్వాండో అసోసియేషన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 8 పథకాలు సాధించారు. అండర్ 12 విభాగంలో ఎం.అరాధ్య, గోల్డ్ మెడల్, జి.వేదాక్షరి, ఎం.స్వాతిక్, రెడ్డి సిల్వర్ మెడల్స్, టి.హంసిని, సిహెచ్.మధు, ఎన్.సహస్ర, జె.ప్రణవి, ప్రహలాదిక బ్రాంజ్ మెడల్స్ సాధించారు. గోల్డ్ మెడల్ సాధించిన ఎం.అరాధ్య ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు ఛత్తీష్‌గడ్ రాయపూర్‌లో జరిగే పోటీలకు ఎంపికైంది. మెడల్స్ సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో పథకాలు సాధించి సిద్దిపేటకు మంచి పేరు తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు వేలేటి రాధాకృష్ణశర్మ, జిల్లా స్పోర్ట్స్ కన్వీనర్ సాయిరాం,సుడా మాజీ చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, జిల్లా తైక్వాండో కార్యదర్శి మాస్టర్ రాసకొండ శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అమెజాన్ ఉపాధ్యాయ శిక్షణను రద్దు చేయాలి

**మిరుదొడ్డి,జనవరి27,ప్రభాతవార్త**
ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండానే జిలావిద్యాశాఖ ఆదేశాలు జారీ చేసి బహుళజాతి సంస్థ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగాన్ని టిపిటిఎస్ జిల్లాశాఖ తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఖండిచింది.ఈ మేరకు అమెజాన్ ఇసునతన్న శిక్షణ కార్యక్రమాన్ని తక్షణమే విద్యాశాఖ రద్దు చేయయాలని డిమాండ్ చేసింది.ఈ మేరకు జిల్లా విద్యాశాఖ తన ఉత్తర్వుల్లో ఈనెల23నమోమో నంబర్ 456పేరిట ఉత్తర్వులను ఇవ్వడాన్ని తప్పుపడుతూ ఉపాధ్యాశిక్షణ.పరిశోధన లాంటి కార్యక్రమాలను ప్రభుత్వ అనుమతి లేకుండా అమలు చేయరాదని స్పష్టత ఇచ్చారు.ఈ నేపధ్యంలో సిద్దిపేట విద్యాశాఖ ఆదేధాల మేరకు పట్టణంలో ఉన్నత పాఠశాలల్లో ఒక బడిలో ముగ్గురు ఉపాధ్యాయులను రెండు విడతలుగా బహుళజాతి సంస్థ అయిన అయెజాన్ శిక్షణ ఇవ్వడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకిసుస్తున్నారు.ఈ శిక్షణను తక్షణమేరద్దు చేయాలని జిల్లా అధ్యక్షులు సి హెచ్ విజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.ఇప్పటికే పాఠశాలల్లో ఉన్నతి కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా ఈ శిక్షణ పేరిట మరింత ఒత్తిడిని తీసుకువచ్చే కార్యక్రమాన్ని ఉపాధ్యాయులపై రుద్దడం సరికాదని ధ్వజమెత్తారు.ఉన్నతశాఖ అధికరారులు,ప్రొఫెసర్లు మాత్రమే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాల్సిన దీనిని ప్రయివేట్ సంస్థలకు అప్పగించడాన్ని దారు తప్పుపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వి భాస్కర్‌రెడ్డి,సీనియర్ నాయకులు జి తిరుపతిరెడ్డి,రాష్ట్రకౌన్సిలర్లు జానికిరాములు, పద్మయ్య ,విష్ణు వర్దన్, జిల్లా నాయకులు జి సత్యనారాయణ, నరసింహారెడ్డి, మహమూద్, మల్లేశం, శివాజీ,నరేందర్,విద్యాపాగర్,జనార్ధన్‌రెడ్డి,రాములు,మహేందర్,సుధాకర్‌రెడ్డి,రామచంద్రం తదితరులున్నారు.



అమెజాన్ శిక్షణను రద్దుచయాలని ఉపాధ్యాయసంఘం డిమాండ్

## పట్టణ సిఐ రాజు బదలీ

**జహీరాబాద్, జనవరి 27, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణ సిఐగా విధులు నిర్వహించిన బి రాజు బదిలీ కాగా కొత్త సిఐగా ఆర్ రవిని జహీరాబాద్‌కు బదిలీ చేస్తూ హైద్రాబాద్ జోన్ ఐజి ఉత్తర్వులు జారీ చేశారు. సంగారెడ్డి సిసిఎస్‌లో సిఐగా విధులు నిర్వహిస్తున్న ఆర్ రవిని పట్టణ సిఐగా నియమితులయ్యారు. జహీరాబాద్ నుంచి బదిలీ అయిన సిఐ బి రాజును ఎక్కడ పోస్టింగ్ ఇవ్వకుండా ఐజి కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

## దైవచింతనతో మానసిక ప్రశాంతత



మానసికప్రశాంతతపై వివరిసునతన్న పీఠాధిపతి

**మిరుదొడ్డి,జనవరి27,ప్రభాతవార్త**
దైచింతనతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని తోగుట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి ఉపదేశించారు.ఈ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గీతాపారాయణం అనంతరం ఉపదేశిస్తూ హైటెక్ యుగంలో మానవులందరూ పనుల ఒత్తిడిలో మానసికంగా ప్రశాంతత కరవై ఈ గాతాజ్ఞానంతో మానవుల్లో పరివర్తన రావాల్సిన అవసరముందని ఇది అధ్యాత్మిక చింతనతోనే సాధ్యమవుతుందని ఆయన ఉపదేశించారు.

## కలిసికట్టుగా సాగితేనే విజయం తథ్యం



.రాష్ట్రమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన యువజనకాంగ్రెస్ కార్యదర్శి పూజల గోపీక్రిష్ణ

**సిద్దిపేటఅర్బన్,జనవరి27,ప్రభాతవార్త**
యువజన కాంగ్రెస్ నేతలు పార్టీ నాయకులతో సహ కలిసికట్టుగా కలిసి పని చేసేనతనే రాబోవు పార్లమెంట్ ఎన్నికలలో అనుకన్న లక్ష్యాన్ని సాదించి విజయాన్ని దక్కించుకుంటామని రాష్ట్రనీటిపారుదలశాఖమంత్రి,పౌరసరఫరామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన యువజననాయకలకు సూచించారు.ఈ నేపధ్యంలో శనివారం సిద్దిపేట యువజనకాంగ్రెస్ కారనయదర్శి పూజల గోపీక్రిష్ణ యర్యాదపూర్వకుంగా కలిసిన సందర్భంగా పై విధంగా చెప్పారు,ఇందుకు కాంగ్రెస్ నాయకులు సైనికుల్లా పనిచేయాని వారితో అన్నారు.ప్రభుత్వ కార్యమాలను గడప గడపకు తీసుకుపోవాలని వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో వినయ్,రితేష్,నవీన్,అరవింద్ తదితరులున్నారు.

## ఢిల్లీలో బహుమతులను అందుకున్న తెలంగాణ కబడ్డీ జట్టు



ఢిల్లీలో బహుమతులను అందుకుంటున్న తెలంగాణ కబడ్డీ జట్టు

**చిన్నశంకరంపేట,జనవరి 27,ప్రభాతవార్త:**
జాతీయ స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో తెలంగాణ జట్టు సత్తా చాటింది. డీల్లిలో నిర్వహించిన అండర్-19 కబడ్డీ పోటీలలో గత సోమవారం హర్యానా జట్టుతో తెలంగాణ జట్టు తలపడి విజేతలుగా నిలిచి మొదటి బహుమతిని సాధించింది. మొత్తం నాలుగు రాష్ట్రాలతో పోటిపడి ఫైనల్‌కు చేరినట్లు వారు తెలిపారు. తెలంగాణ జట్టు నుండి చిన్నశంకరంపేట మండల పరిధిలోని గవ్వలపల్లి తండాకు చెందిన దినేష్, వినోద్, కొర్విపల్లి తండా నుండి సందీప్‌లు జట్టులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తులు అభినందించారు.

## ప్రతిష్ట మహోత్సవాలకు రావాలని మల్లేష్‌గౌడ్‌కు ఆహ్వానం



నత్నాయపల్లిలో జరిగె ప్రతిష్ట మహోత్సవాలకు రావాలని వాల్డాస్ మల్లేష్‌గౌడ్‌ను ఆహ్వానిస్తున్న ప్రతిష్ట కార్యక్రమ నిర్వాహకులు తదితరులు

**నర్సాపూర్,జనవరి 27.ప్రభాతవార్త:**
మండల పరిధిలోని నత్నాయపల్లి గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణ, నవగ్రహాల ప్రతిష్ట మహోత్సవాలను ఆ గ్రామస్తులు నిర్వహిస్తున్నారు. ఈమేరకు శనివారం నర్సాపూర్‌లోని బిజెపి నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్ వాల్డాస్ మల్లేష్‌గౌడ్ ను ఈ శ్రీ సీతారామలక్ష్మణ, నవగ్రహాల విగ్రహాల పతిష్ట మహోత్సవాలకు రావాలని ఆ గ్రామానికి చెందిన ప్రతిష్ట కార్యక్రమ నిర్వాహకులు నీలి నాగేశ్,ఉదయ్‌కుమార్, సాయినాథ్,రాజేశ్, దుర్గయ్య తదితర గ్రామస్తులు మల్లేష్‌గౌడ్ కు ఆహ్వాన పత్రికను ఇవ్వడం జరిగింది.నత్నాయపల్లి గ్రామంలో జరిగే ప్రతిష్ట మహోత్సవాలకు తప్పని సరిగా రావాలని వారు వాల్డాస్ మల్లేష్‌గౌడ్ ను కోరారు.

## నేడు మండలంలో పర్యటించనున్న ఎమ్మెల్యే సునితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

### -నూతన గ్రామ పంచాయతీ భవనాల ప్రారంభం



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాంపల్లి గౌరీశంకర్

**కొల్చారం, జనవరి27 ప్రభాతవార్త:**
ఈ నెల 28న కొల్చారం మండలంలో నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డిల పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ కొల్చారం మండల అధ్యక్షులు రాంపల్లి గౌరీశంకర్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు, సర్పంచి పెరోళ్ల విష్ణువర్ధన్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం మండలంలోని ఏటిగడ్డ మాందాపూర్, నాయిని జలాల్‌పూర్, కొంగోడ్ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయితీ భవనాలను ఎమ్మెల్యే సునితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిలు పర్యటించి ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఏటిగడ్డ మాందాపూర్ గ్రామం నుండి సునితారెడ్డి, మదన్‌రెడ్డిల పర్యటన ప్రారంభమవుతుందని తెలిపారు. కావున ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు,సొసైటీ చైర్మన్లు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గౌరీశంకర్, విష్ణువర్ధన్‌రెడ్డిలు కోరారు

## నేడు చిన్నగొట్టిముక్కులలో ఘనంగా దుర్గమ్మ జాతర

### -హాజరు కానున్న ఎమ్మెల్యే, పలువురు ప్రముఖులు

**శివ్వంపేట, జనవరి27 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్కల గ్రామంలో ఆదివారం ప్రతి సంవత్సరం విధంగానే దుర్గమ్మ జాతరలను ఘనంగా జరపడానికి గ్రామ పంచాయితీ పాలకవర్గం అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఈ దుర్గమ్మ జాతరలను తిలకించడానికి వివిధ గ్రామాల నుండి పెద్దఎత్తున భక్తులు వస్తుంటారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులకు, ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపినట్లు సర్పంచి బాలమణి నరేందర్, ఎంపీటీసీ సభ్యులు నువ్వుల దశరథ, గ్రామ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎంపీపీ హరికృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు మహేష్‌గుప్త, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మండల పార్టీ అధ్యక్షులు రమణాగౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి తదితరులతో పాటు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

## అవార్డు అందుకున్న ఎస్ఐ మహిపాల్‌రెడ్డి



అవార్డు అందుకుంటున్న ఎస్ఐ మహిపాల్‌రెడ్డి

**సిర్గాపూర్, జనవరి 27, ప్రభాతవార్త:**
విధి నిర్వాహణలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఎస్ఐ మహిపాల్‌రెడ్డికి ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురష్కరించుకుని జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని పోలీస్ పరేడ్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, జిల్లా ఎస్పి సిహెచ్ రూపేష్ చెన్నూరిలు ఎస్ఐకు అవార్డును, ప్రశంస పత్రాన్ని అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**సిద్దిపేట రూరల్, జనవరి 27, ప్రభాతవార్త :**
సిద్దిపేట నియోజకవర్గం నర్సాపూర్‌లో కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త రాజయ్య మరణంతో బాధిత కుటుంబాన్ని డీసీసీ ఓబిసిసెల్ అధ్యక్షులు డా॥ లక్కరసు సూర్యచంద్రవర్మ శనివారం పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి బియ్యం, ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఓబిసీ సెల్ నాయకులు జంగోని శ్రీనివాస్‌గౌడ్, మోతే కుమార్, సాయిమల్లు, బండారు లింగం, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం : ఏఈ పెంట్యానాయక్

**రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 27, ప్రభాతవార్త ః**
నేడు ఆదివారం నాడు రామాయంపేటలో విద్యుత్ సరాఫరాలో చిన్న అంతరాయం ఏర్పడుతుందని రామాయంపేట విద్యుత్ శాఖ ఏఈ పెంట్యానాయక్ తెలిపారు. పట్టణంలోని 33/11కెవి సబ్‌స్టేషన్‌లో మరమత్తుల కారణంగా మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రామాయంపేట పట్టణంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి, గొలిపర్తి, మండల పరిధిలోని దామరచెర్వు, ఆర్. వెంకటాపూర్, అక్కన్నపేట, అక్కన్నపేట ఇండస్ట్రియల్ ఏరియాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు ఆయన తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## మండల వివేకానంద సేవ సమితి నూతన కార్యవర్గం



వివేకానంద సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఆనంద్‌ఈశ్వర్‌ను సన్మానిస్తున్న కమిటి బాధ్యులు

**న్యాల్‌కల్, జనవరి 27, ప్రభాతవార్త:**
న్యాల్‌కల్ మండల వివేకానంద సేవ సమితి నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా నియమించినట్లు సేవ సమితి జిల్లా అధ్యక్షులు ఆనంద్ ఈశ్వర్ పేర్కొన్నారు. మండల నూతన కమిటి అధ్యక్షులుగా లవేష్ పాటిల్, కార్యదర్శిగా రుద్రప్ప, ఉపాధ్యక్షులుగా మహేష్, ప్రధాన కార్యదర్శిగా మంజునాథ్, సభ్యులుగా వినోద్, రమేష్, ప్రశాంత్, మల్లికార్జున్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. అంతకు ముందు మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని స్వామి వివేకానంద స్వామి విగ్రహానికి కమిటి నాయకులు పూలమాలలు సమర్పించారు.

## ఇన్సూరెన్స్ చెక్కును అందచేసిన ఎమ్మెల్యే



బిఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి ఇన్సురెన్స్ చెక్కును అందచేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్ (కోహీర్), జనవరి 27, ప్రభాతవార్త**
నియోజకవర్గంలోని కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త పాండురంగారెడ్డి కుటుంబానికి శనివారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు బిఆర్ఎస్ పార్టీ ఇన్సురెన్సు చెక్కును అందచేశారు. ఇటీవల ప్రమాదావశాస్తు తిరిగిరాని లోకాలకు చేరిపోయిన పాండురంగారెడ్డి బిఆర్ఎస్ పార్టీలో క్రియా శీలక సభ్యత్వం ఉండటంతో పార్టీ తరఫున 2లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే పార్టీ నాయకులతో కలిసి పాండురంగారెడ్డి నామిని శేకమ్మకు అందచేశారు. కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ ఉమకాంత్‌పాటిల్, జహీరాబాద్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, సొసైటీ చైర్మన్ మచ్చందర్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోమన్, పట్టణ అధ్యక్షులు శివప్ప, సర్పంచ్ విజయ్, పాండురంగ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామానికి సేవ చెసే అదృష్టం మరువలేనిది

### -పెద్దచింతకుంట గ్రామ సర్పంచ్ గుండె.శివకుమార్

### -పాలకవర్గంను, అధికారులను సత్కరించిన సర్పంచ్



పెద్దచింతకుంటలో చివరి గ్రామ పంచాయతీ పాలక వర్గ సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ గుండె శివకుమార్ తదితరులు

**నర్సాపూర్,జనవరి 27.ప్రభాతవార్త:**
గ్రామానికి సర్పంచ్ గా బాధ్యతలు నిర్వహించి గ్రామస్తులకు సేవలుఅందించడం తన అదృష్టమని పెద్ద చింతకుంట గ్రామ సర్పంచ్ గుండె శివకుమార్ అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో చివరి పంచాయతీ పాలక వర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి పంచాయతీ పాలక వర్గానికి, వివిద డిపార్ట్‌మెంట్ ల అధికారులకు శాలూవాలతో ఘనంగా సన్మానించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపిడివో మార్టిన్ లూథర్.ఎంపిపి ఉపాధ్యక్షులు వెంకటనర్సింగరావు లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గుండె శివకుమార్ మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ పాలక వర్గం సహకారంతోగతంలో ఎన్నడు లేని విదంగా అభివృద్ధి పనులు చేశామని ఆయన గుర్తు చేశారు.ప్రత్యేకంగా గ్రామంలో పల్లె ప్రకృతి వనంఏర్పాటు,,రోడ్లు వేయించడం,మురికి కాలువల నిర్మాణాలు,కరెంటు స్థంబాల ఏర్పాటు, మంచి నీటి సౌకర్యం వంటి వి ఈవిదంగా అనేక అభివృద్ధి పనులు నిర్వహిస్తు ప్రజలకు ఎప్పుడికప్పుడు అందుబాటులో ఉండెలా అవకాశం ఇవ్వడం మరిచిపోలేని అనుభూతి అంటు గ్రామస్తులతో తన అనుభవాలను పంచుకున్నారు. ఈకార్యక్రమంలోఉప సర్పంచ్ కడారి నాగరాజు, వార్డు సభ్యులు వాణి,వెంకటేశ్, మల్లాగౌడ్,ప్రసాద్, దుర్గేష్,నీలాశంకర్, అంజమ్మ, పెద్దులు, కోఆప్షన్ సభ్యులు శోభ విష్ణు, ఆశ వర్కర్ సంధ్య, వివోఏ కవిత, కార్యదర్శి సుల్తానా బేగం మిని అంగన్‌వాడి టీచర్ నీలా,పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.